క్లుప్తంగా

ఆదిత్యున్ని దర్శించుకున్న ఎస్‌బీఐ వైస్ ప్రెసిడెంట్


అనివెట్టి మండపంలో రంగరాజన్, మధుసూదన్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (హైదరాబాద్) కె.రంగరాజన్ మంగళవారం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. క్షేత్ర పాలకులైన శ్రీభువనేశ్వరి సహిత రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్న తర్వాత ఆలయ ఈవో వై.భద్రాజీ ప్రసాదాలను అందజేశారు. రిటైర్డ్ డిప్యూటీ మేనేజర్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతికతను అలవర్చుకుని నైపుణ్యాభివృద్ధి సాధించాలన్నారు. కాలానుగుణంగా కార్యాలయాలకు ఉపయోగపడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ఎక్సెల్ షీట్స్, తదితర వాటిపై పట్టు సాధించాలన్నారు.

వైభవంగా చిన్నమ్మి తల్లి గ్రామదేవత ఉత్సవం


ఘటాలతో బయలుదేరిన భక్తులు

గార: వాడాడ గ్రామదేవత చిన్నమ్మి తల్లి గ్రామదేవత ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. పంచాయతీ పరిధిలోని చిన్నవాడాడ మొదలుకొని కొత్తూరు, రెడ్డిపేట గ్రామాలకు చెందిన భక్తులు ఘటాలతో తిరువీధి నిర్వహించారు. అనంతరం వాడాడ గ్రామదేవత ఆలయం వద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ ఆర్.జనార్దన బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.4.54లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేట నారాయణ తిరుమల కొండపై వేంకటేశ్వరస్వామి దేవాలయం హుండీల ఆదాయం రూ.4,54,278 వచ్చిందని ఈఓ శ్యామలరావు తెలిపారు. మంగళవారం దేవదాయశాఖ ఈఓ మాధవి, అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, పెద్దల సమక్షంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కించినట్లు పేర్కొన్నారు. 75 రోజులకుగాను ఈ ఆదాయం సమకూరినట్లు చెప్పారు. కార్యక్రమంలో వేంకటరామానుజ సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు నిధులు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

జి.సిగడాం: ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించడంతో లబ్ధిదారులకు చెల్లించేందుకు చర్యలు చేపట్టామని మండల పరిషత్ ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్‌బాబు అన్నారు. మంగళవారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరయ్యేదని, ధరలు పెరిగిన నేపథ్యంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా రూ.50 వేలు చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఈ నిధులతో శరవేగంతో గృహ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, గృహ నిర్మాణ శాఖ ఏఈఈ యువరాజ్, ఏపీఓ ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ స్కానర్ల పంపిణీ

జి.సిగడాం : మండలంలో 21 గ్రామ సచివాలయాల ఉద్యోగులకు పింఛన్ల పంపిణీ, సర్వేల నిమిత్తం 227 బయోమెట్రిక్ స్కానర్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సచివాలయం సిబ్బందికి స్కానర్లను పంపిణీ చేశారు.

ఉత్తమాటలేనా.. ఉత్తర్వులు వచ్చేనా?

- ఇళ్ల నిర్మాణ అనుమతులు సులభం చేస్తామని ప్రకటించిన మున్సిపల్ మంత్రి
- ఉత్తర్వులు వెలువరించకపోవడంతో కఠినమవుతున్న ప్రక్రియ
- కార్పొరేషన్ పరిధిలో జాడ లేని సర్క్యులేషన్ పేట్రన్
- అప్‌డేట్ అంటూ ఎప్పటికప్పుడు వెబ్‌సైట్ నిలుపుదల
- నగర పరిధిలో నిలిచిపోయిన భవన నిర్మాణాలు



శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం

శ్రీకాకుళం: పట్టణాలు, నగర పరిధిల్లో ఇళ్ల నిర్మాణం అనుమతులు ఇకపై సులభతరం చేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆర్భాటంగా ప్రకటించారు. అయితే అందుకు అనుగుణంగా ఉత్తర్వులు విడుదల చేయలేదు. దీంతో సులభతరం మాట అటుంచితే అనుమతులు పొందటం తలకు మించిన భారంగా మారుతోంది. వంద గజాల లోపు భవన నిర్మాణానికి అనుమతి అవసరం లేదని, ఐదు అంతస్తుల భవనాలకు స్థానికంగానే అనుమతులు పొందవచ్చని, 15 అడుగుల కంటే తక్కువ రోడ్డు ఉన్న ప్రాంతాల్లో ఇంటి ముందు స్థలం విడిచి పెట్టనవసరం లేదని... ఇలా అనేక రకాలుగా పట్టణ ప్రజలకు ఊరించారు. అవేవీ కార్యరూపం దాల్చడం లేదు.

సాంకేతిక సమస్యల పేరిట..

వెబ్‌సైట్ మెయింటెనెన్స్, అప్‌డేట్ పేరిట ఎప్పటికప్పుడు వెబ్‌సైట్ నిలిపివేయటంతో అనుమతులు కోసం దరఖాస్తులు చేసుకోవటం నగరవాసులకు కష్టంగా మారింది. డిసెంబర్ వరకు వెబ్‌సైట్‌లో సాంకేతికపరమైన ఇబ్బందులు ఉన్నాయని, వాటిని సరిచేయటంతో పాటు సరికొత్తగా సిద్ధం చేస్తున్నామని రెండున్నర నెలలకు పైగా వెబ్‌సైట్‌ను నిలుపుదల చేసిన సంగతి తెలిసిందే. అ తర్వాత వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చినప్పటికీ కొన్ని ధ్రువపత్రాలను తిరస్కరించటం వల్ల నిర్మాణదారులు అనుమతులకు ఇబ్బంది పడుతూ వచ్చారు. గత 20 రోజుల నుంచి వెబ్‌సైట్ అందుబాటులో లేకుండాపోయింది. అప్‌డేట్ చేస్తున్నామని రాష్ట్ర స్థాయి నుంచి నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలకు సమాచారం అందుతుందే తప్ప వెబ్‌సైట్ అందుబాటులోకి రావటం లేదు.

పత్తాలేని సర్క్యులేషన్ పేట్రన్..

పది అడుగుల రోడ్డు మాత్రమే ఉన్న చోట ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి ముందు పది అడుగుల ఖాళీ స్థలాన్ని ఉంచాల్సిన అవసరం లేదని గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం మారిపోవటంతో ఆ విధానం అమల్లోకి రాలేదు. కూటమి ప్రభుత్వంలో తప్పకుండా అమలు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ స్థానికులకు పలుమార్లు హామీ ఇచ్చారు.

మూడు నెలల క్రితం సీఎంతో ఈ విషయమై మాట్లాడానని, వారం రోజుల్లో అమల్లోకి వస్తుందని ఎమ్మెల్యే బహిరంగంగా ప్రకటించారు. అయినా కార్యరూపం దాల్చలేదు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ల పెన్‌డౌన్..

మంత్రి చేసిన ప్రకటన మేరకు.. అనుమతుల్లో వచ్చే తప్పులకు తమను బాధ్యులు చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు, అరెస్టులు చేస్తామని పేర్కొనడాన్ని నిరసిస్తూ సర్వేయర్లు రెండు నెలలుగా పెన్‌డౌన్ చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగం ఉండగా వారిని వదిలి తమను బాధ్యులు చేయటం ఏంటని ప్రశ్నిస్తున్నారు. దీంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. కొత్త నిర్మాణాలు ముందుకు రావటం లేదు. నిర్మాణదారులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. పరిస్థితులు ఎప్పుడు చక్కబడతాయో తెలియని దుస్థితి నెలకొంది.

అప్‌డేట్ వల్లే..



వెబ్‌సైట్ విషయంలో రాష్ట్ర స్థాయి అధికారులను అడుగుతున్నాం. అప్‌డేట్ చేస్తుండటం వల్ల నిలుపుదల చేశారు. సర్క్యులేషన్ పేట్రన్‌ను వెబ్‌సైట్‌లో పొందుపర్చేందుకు సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– ప్రసాదరావు, నగరపాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

ఎస్సీ వర్గీకరణతో అన్యాయం


మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ వర్గీకరణతో రాష్ట్రంలో మాల, రెల్లి, వాటి అనుబంధ కులస్తులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డాక్టర్ కంత వేణు, తైక్వాండో శ్రీను, రెల్లి కుల సంక్షేమ సంఘం నాయకులు అర్జి కోటి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణకు ఎన్‌డీఏ కూటమి సిద్ధపడటంపై మండిపడ్డారు. సమగ్ర కులగణన లేకుండా ఎస్సీలను ఎలా వర్గీకరిస్తారని ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్జీవో హోమ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని వర్గీకరణను అమలు చేసేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సిద్ధపడటం దారుణమన్నారు. 2025 నాటికి ఏపీలో మాలలు, రెల్లి, వాటి అనుబంధ కులాల జనాభా ఎంతగానో పెరిగిందని, ఆ లెక్కలను పరిగణనలోకి తీసుకోకుండా 14 ఏళ్ల కిందటి నాటి లెక్కలను పరిగణనలోకి తీసుకోవడం సరికాదన్నారు. సుప్రీం తీర్పులో ఎంపరికల్ డేటాను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. మెజార్టీ దళిత ఎమ్మెల్యేలు జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేయాలని కోరుతున్నా రాష్ట్ర యూనిట్‌గా చేసేందుకు కూటమి ప్రభుత్వం అత్యుత్సాహం చూస్తుంటే మాదిగలకు లబ్ధి చేకూర్చేందుకేనని దుయ్యబట్టారు. మాదిగ సామాజికవర్గ ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను మాత్రమే తీసుకుని.. మాల సామాజికవర్గ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేల మాటలను లెక్క చేయకపోవడం దారుణమన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికపై ఈ నెల 20న అసెంబ్లీలో చర్చించనున్న నేపథ్యంలో సమగ్ర కులగణన నిర్వహించిన తర్వాతే ఎస్సీవర్గీకరణపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు యజ్జల గురుమూర్తి, సింకి రమణ,పెయ్యల చంటి, ఎస్.సూర్యనారాయణ, అబ్బాస్, అర్జి ఈశ్వరరావు, దూళి మోహన్, తిరుపతిరావు, రామ్మోహన్‌రావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రేషన్ సరుకులకు ఈకేవైసీ తప్పనిసరి


జె.ఆర్.పురంలో ఈకేవైసీ పరిశీలిస్తున్న ఆర్‌ఐ

రణస్థలం: ఏప్రిల్‌లో రేషన్ సరుకులు పొందాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సివిల్ సప్లయ్ ఆర్‌ఐ ఏ.రమాబాయి స్పష్టం చేశారు. జె.ఆర్.పురం పంచాయతీలోని బ్రహ్మజీ రేషన్ దుకాణంలో ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 83,512 మంది లబ్ధిదారులకు గాను 10,800 మంది సభ్యుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వీరంతా నెలాఖరులోపు ఆధార్ నంబర్‌తో ఈకేవైసీ వేయించుకోవాలని సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులు గ్రామ సచివాలయాల్లో ఆధార్ వేలిముద్రలు వేయించుకుని ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలి


గ్రీన్ హౌస్‌లో వ్యవసాయ క్షేత్రం పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: వ్యవసాయ విద్యార్థులు పరిశోధనలు, ప్రయోగ విద్యకు ప్రాధాన్యమివ్వాలని ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాస్ అన్నారు. సంత సీతారాంపురంలోని సైకి వ్యవసాయ కళాశాలను మంగళవారం పరిశీలించారు. విద్యా ప్రమాణాలు, ప్రయోగ విద్య, వ్యవసాయ క్షేత్రాలు సాగు తదితర అంశాలపై ఆరా తీశారు. తక్కువ ఖర్చుతో మెరుగైన సాగు, భూసార పరీక్షలు, ప్రాంతాలకు తగ్గ విత్తనాల ఎంపిక, మంచి దిగుబడి సాధించటం వంటి అంశాలు కీలకమని చెప్పారు. వ్యవసాయ విద్య మిగతా కోర్సుల్లా కాదని, అన్నివేళలా డిమాండ్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భారతలక్ష్మి, స్థానిక అసోసియేట్ డీన్ డాక్టర్ మోష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల : లావేరు మండలం తామాడలో విజయ దుర్గ భవానీమాత ఆలయ ఆరో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాలిశెట్టి మధుబాబు ఆధ్వర్యంలో ఆలయ ఆస్థాన పండితులు సాయిశర్మ, నాగేశ్వరశర్మ, కృష్ణచైతన్య శర్మ నేతృత్వంలో మండప పూజలు, కుంకుమ పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అల్లంశెట్టి వెంకట్రావు, మారం అప్పన్న, గాలి అసిరినాయుడు, మల్లిబాబు, దండ హరీష్, ప్రసాద్, గొల్లబాబు, మురపాక జన తదితరులు పాల్గొన్నారు.

అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ నిర్ణీత గ్యాస్ బిల్లు కంటే అదనంగా వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సివిల్ సప్లయ్ ఉప తహసీల్దార్ ఎస్.చక్రవర్తి హెచ్చరించారు. మంగళవారం నగరంలోని ఆరు గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, డెలివరీ బాయ్స్‌లతో వారి కార్యాలయాల్లో వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ ఇటీవల డెలివరీ బాయ్స్‌పై ఫిర్యాదు వస్తున్నాయని చెప్పారు. ఇకపై ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో ఐడీఆర్ఎస్ ద్వారా వినియోగదారుల నుంచి, అభిప్రాయాల సేకరణ జరుగుతోందని చెప్పారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

విస్తృతంగా రోటరీ క్లబ్ సేవలు


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో రోటరీక్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలను మరింతగా విస్తృతం చేయాలని క్లబ్ గవర్నర్ డాక్టర్ మల్లా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలియో నివారణకు శతశాతం కృషి జరుగుతుందన్నారు. అంతకుముందు హౌసింగ్ బోర్డ్ కాలనీలోని రోటరీ వనాన్ని సందర్శించి మొక్కలు నాటారు. పబ్లిక్ హెల్త్‌చైర్ ఎంఆర్‌కే దాస్ తల్లిదండ్రులు ఎంబీకే దాస్, ఎం.అమ్మాజీ సోదరుడు ఎంఎస్ఎన్ దాస్ జ్ఞాపకార్థం 14 మందికి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. క్లబ్ ఒకేషనల్ డైరెక్టర్ డాక్టర్ మంత్రి వెంకటస్వామి పర్యవేక్షణలో జిల్లాలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన పదిమందికి రోటరీ పురస్కారాలు అందజేశారు.

నైతిక విలువలకు నెలవు 'రామాయణం'


పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్ : రామాయణం మనకు నైతిక విలువలు నేర్పిస్తుందని ఆధ్యాత్మిక వేత్త ఎర్రాప్రగడ రామకృష్ణ అన్నారు. పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో విశ్రాంత ప్రొఫెసర్ నిక్కు అప్పన్న రచించిన 'నేను–నా జన్మభూమి బుడితి' అనే పుస్తకావిష్కరణ, 'రాముడొచ్చాడు' అనే అంశంపై ప్రసంగం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపన చరిత్రాత్మకమని చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వరరావు, డాక్టర్ కోమలరావు, నిష్టల నరసింహమూర్తి, పైడి హరనాథరావు, జంధ్యాల శరత్‌బాబు, పులఖండం శ్రీనివాసరావు, గుమ్మ నగేష్, సురంగి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న పీఎస్‌వీఎస్ శర్మ

శ్రీకాకుళం అర్బన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత ఉద్యోగులకు ఎటువంటి సమస్యలున్నా పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ డీజీఎం, సీడీఓ రాహుల్ సంక్రిత్య, ఎస్‌బీఐ విశాఖ డీజీఎం బీపీఓ పంకజ్ కుమార్ చెప్పారు. ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ నాలుగో సర్వసభ్య సమావేశం అరసవల్లి కూడలిలోని ఓ హోటల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అమరావతి సర్కిల్ అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రరావు, పి.ఎస్.వి.ఎస్ శర్మ, శ్రీకాకుళం ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి శంకర్, ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ డి.కృష్ణకుమార్, ఎస్‌బీఐ భువనేశ్వర్ సర్కిల్ అధ్యక్ష కార్యదర్శులు గణేష్ చంద్ర మిశ్రా, ఉపేంద్ర కుమార్‌దాస్, ఎస్‌బీఐ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఆర్.నరేంద్రకుమార్, ఆఫీసర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జె.శ్రీనివాస్, ఎస్‌బీఐ సేవా విభాగం ప్రతినిధి రవీంద్ర నాయక్, సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ చాగంటి బాపయ్య పంతులు తదితరులు పాల్గొన్నారు.

• అంబరాన్నంటిన సంబరాలు






బాకర్‌సాహెబ్‌పేటలో గ్రామదేవత పాదాలమ్మ ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. దుర్గామహాలక్ష్మీ అమ్మవారి ఆలయం నుంచి ఘటాలు బయలుదేరగా.. తప్పెటగుళ్లు, పులివేషాలు, హనుమాన్ వేషధారణ, చెక్కభజనలతో భక్తులు తరలివచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆదుకున్న ఆపద్బాంధవులు


శ్రీకాకుళం కల్చరల్: చిన్నారావుకు సాయం అందించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఆదిల్ షా


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చంద్రశేఖర్‌కు సాయం చేస్తున్న దాతలు


ఎచ్చెర్ల క్యాంపస్: సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఎచ్చెర్ల మండలం అల్లినగరానికి చెందిన గేదెల చిన్నారావు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోవడంతో దాతలు సాయం అందిస్తున్నారు. నగరంలోని కత్తెరవీధికి చెందిన ఒప్పంగి పంచాయతీ సెక్రటరీ ఆదిల్ షా మంగళవారం మందులు, నగదు సాయం అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, ఉర్లం శివ తేజ, బి.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పరిధిలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న లావేటి చంద్రశేఖర్ కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం పలువురు దాతలు రూ.53,500 సాయంగా అందజేశారు.

ఎచ్చెర్ల క్యాంపస్: విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బ్రెయిన్ ట్రూమర్ చికిత్స పొందుతున్న నంద నిహాల్ అనే 11 ఏళ్ల బాలుడికి ఎచ్చెర్లకు చెందిన మదర్స్ ఆఫ్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు రూ.52 వేలు అందజేశారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధి, ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గంగా ప్రియదర్శిని మంగళవారం తెలియజేశారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా


జాబితాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిప్రత్యూష

శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించిన పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిప్రత్యూష కోరారు. మంగళవారం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతివారం ఓటరు జాబితాను అప్‌డేట్ చేస్తుండాలన్నారు. రెండు కిలోమీటర్లు కంటే ఎక్కువ దూరం ఉన్న ఓటర్లను సమీప ప్రధాన పోలింగ్ కేంద్రానికి షిఫ్ట్ చేయాలని సూచించారు. సమావేశంలో శ్రీకాకుళం తహశీల్దార్ గణపతిరావు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, గార తహశీల్దార్ పద్మావతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి


మాట్లాడుతున్న అకడమిక్ అధికారి ధర్మకుమార్

రణస్థలం: వేసవి ఎండల నేపథ్యంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రతలపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఆదర్శ పాఠశాల రాష్ట్ర అకడమిక్ మోనటరింగ్ అధికారి కె.ధర్మకుమార్ అన్నారు. రణస్థలం ఆదర్శ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రతి విద్యార్థి ఎస్ఏ-2 పరీక్షలకు హాజరయ్యేలా చూడాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి తెలుగు పరీక్ష జరిగిన విధానంపై ఆరా తీశారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాట్నూరు శ్రీధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

ఎచ్చెర్ల క్యాంపస్: తమ వేతనాలు పెంచాలని అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకులు మంగళవారం వీసీ కె.ఆర్.రజినిని కలిశారు. సీనియారిటీకి అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం పెంచాలని సూచించారు. విద్యార్హత ఆధారంగా వేతనాలు పెంచాలని, వర్సిటీ ప్రగతికి కాంట్రాక్టు అధ్యాపకులం శక్తి వంచన లేకుండా కృషిచేస్తున్నట్లు చెప్పా రు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వీసీ తెలిపారు.